"ఈ సంక్రాంతి పండగ శుభ సందర్భంలో విచ్చేసిన అక్కలూ, బావలూ, అన్నలూ, వదినలూ, మేనమావలూ, మేనత్తల సమక్షంలో ఒక ప్రకటన—నేనూ, సుధాకర్ పెళ్లి చేసుకోబోతున్నాం."

"ఆ!"

"ఏవిటీ?"

"ఆఁ ఆఁ?"

"ఏవిటండీ అలా మొద్దు రాచ్చిప్పలా ఊరుకుంటారు .... అమ్మాయేదో అంటోంది .... నిజవేనా .... నువ్వయినా ఆయనకి కాస్త చెప్పన్నయ్యా .... ఆయన్ని చూస్తే ప్రొఫెసరుగారూ ....నేనా చదువు లేని దాన్ని. నా మాటలోక లక్ష్యవా ఏవన్నానా?''

"జావనేవిటీ అడిగేది? నువ్వూరుకో.. ఏవిటే గీతా నువ్వంటున్నది .... సుధాకరెవరూ .... పెళ్లేవిటీ .... మతీసుతీగాని పోయిందేవిటీ?"



"నాకేం మతిపోలేదు. సుధాకర్ నాన్నారి స్టూడెంటు. రిజిష్ట్రార్ ఆఫీసుకు నోటీసిచ్చేసాం. వచ్చే నెల పదహారో తేదీ మధ్యాహ్నం పన్నెండు గంటలకి పెళ్ళి మీరంతా విచ్చేసి మదర్పిత నమస్కారాలు మాత్రం స్వీకరించ ప్రార్థన."

"ఏవిటి చెల్లాయ్ .... వేళాకోళవా? నాన్నారూ, మీ కతను తెలుసునా? ఈ పెళ్ళి సంగతి కూడా తెలుసా?"

"నాకు తెలుసు. కుర్రాడు బుద్ధిమంతుడు. రీసెర్చి చేస్తూనన సల్ఫ్యూరికాసిడ్ ప్లాంట్ లోనే పార్టు టైమ్‌గా పనేస్తున్నాడు. ఓ సుధాకర్! సమయానికి వచ్చేవ్ రా....రా...."

"కుర్రాడు బాగానే వున్నాడు గానట్టి కాదననుగానీ. లక్షణంగా ఆకాశవంత పందిరీ, భూదేవంత పీటవేసి పెళ్ళి చెయ్యకుండా ఈ రిజిస్ట్రీ పెళ్ళేవిటన్నయ్యా. ఏదో ఇంటి ఆడపడుచును చెప్తున్నాను. వచ్చేనెలే పెళ్ళి చేసుకుంటానని శివాలేస్తున్నాది, ఆ నెలంతా శుక్రమూఢంలా వుంది. ఆ పంతులు గార్నోసారి పిలిపించి,"

"మరేం అడ్డు చెప్పకండి పిన్నిగారూ. నాకూ, గీతకూ అలాంటి పట్టింపు లేవు. కులం అని చూడకుండా మనిషిని చూసి ఒప్పుకున్నందుకు నా ధన్యవాదాలు."

"అదికాదు బాబూ .... పెళ్ళంటే నూరేళ్ళ పంట....ఏదేనా జరిగితే చాలా బాధ పడాల్సి వుంటుంది...."

"ఏమిటి మావయ్యా.... మీరూ, మీ చాదస్తంమాటలూను....మీఅడ్డంకులే మా కపశకునాలు.... నాన్నారూ.... మీరొక్కమాట అనౌన్సు చేసెయ్యండి.... వీళ్ళు మరి మాటాడరు."

"ఎస్....వచ్చేనెల పదహారో తేదీనే అమ్మాయి పెళ్ళి....ఓకే....?"

* * *

ఎంత నమ్మకాలేకపోతే మాత్రం కన్ను పోయ్యేటంతగా కాటుక పెట్టుకుంటారుటండీ? అహ.... తెలీకడుగు తానూ శాస్త్రాలే్న ధిక్కరిస్తే ఏమవుతుందండీ....కాకపోతే అలా పెళ్ళి చేసుకున్నాడు నిక్షేపంలాంటి కుర్రాడు. ఆర్నెల్లు తిరిగిందా....లేదు. ఆ ఫ్యాక్టరీలో అదేదో యాసిడ్డుట.... సలసల మరుగుతోంది.. స్క్రూడ్రైవరో నాబొందో తెమ్మని ప్రొఫెసరుగారు పురమాయిస్తే తనే వెళ్ళబోయి పనివాణ్ణి పంపేట్ట....అలా పలికిస్తాడండీ భగవంతుడూ....భళ్ళున పగిలిపోయింది. పనివాడు అలాపోయి బ్రతికిపోయేడు.... కుర్రాడిలా వుండిపోయి వెళ్ళిపోయేడు. ప్రొఫెసరుగారు గాయాలతో మంచాన పడ్డారు. అయినా తెలిసి తెలిసీ శుక్రమూఢం మిడసరి లగ్నవూ ఏవిటండీ.... చదువుకునికూడాను....పిదపకాలం పిదప బుద్ధులూ కాపోతే....?

* * *

"సరిగ్గా పదిహేనురోజులకు అద్భుతమైన ముహూర్తం వుంది. మావగారింట్లో కూర్చున్న అల్లుడిలా శుక్రస్థానం, పూలపల్లకిమీద కూర్చున్న పెళ్ళికొడుకులా గురుస్థానం శుభప్రదాన్ని సూచిస్తున్నాయి. బావగా రేవంటారు? నిశ్చయం చేసేసుకుందామా?"




"శుభస్య శీఘ్రం....ఏవిరా అబ్బాయ్.. నీకేమైనా అభ్యంతరమా ?"

"అబ్బే ఏవీ లేదండి .... నిశ్చయం చేసుకున్న ఘడియలు మంచివో కావో కాస్త చూసుకున్నారా ? లేకపోతే కాస్త చూడండి."

"బాగు బాగు...ఏవీ పంచాంగం అందుకోండి....శుభం.... ఏకాదశీ శుక్రవారం. మన సంబంధంలో దోషం లేనట్టే. ఎక్కడా కాగడా వేసి వెతికినా వర్జ్యం గాని దుర్ముహూర్తంకాని కనబట్టంలేదు. ఈ తాంబూలాన్ని పుచ్చుకొని శుభాన్ని పలకండి బావగారూ ...."

"శుభం ...."

"అన్నట్టు బావగారూ .... పెళ్ళయిన తర్వాత అమ్మాయికి తిరుపతి మొక్కు ఒహటుంచట. మరి దానిక్కూడా ముహూర్తం చూసేసుకుంటే, గర్భాదాన ముహూర్తం తిరిగి వచ్చేక చూసుకోవచ్చు .... ఏవంటారు ?

"నాదేవుంది బావగారూ ....వాళ్ళిద్దరూ ఏవంటే అదే కానియ్యండి .... ఏవిరా అబ్బాయ్"

"అలాగే నాన్నగారూ ...."

"అయితే సరిగ్గా పెళ్ళయిన రెండో నాడు ప్రయాణానికి మంచి ముహూర్తం వుంది. ఆరోజు బయలుదేరి మొక్కు చెల్లించుకుంటారు."

"శుభం."

ఫెళ్ళున పెళ్ళి జరిగింది అనుకున్న ముహూర్తానికి. అవునా ? సరిగ్గా ఆ రెండో నాడు పెళ్ళికుమారుడూ, పెళ్ళికుమార్తె, మరో ఇద్దరు దగ్గరవాళ్లూ తిరపతి బయలుదేరారు. బోధపళ్ళేదూ.... కాని చూసేవూ వెధవది కాలం ఎంత చెడ్డదో. కాంక్రీటు సిమెంటు వేసినంత గట్టిగా ముహూర్తం పెట్టడవేమిటీ .... ఆ తిరపతి ఘాట్ రోడ్డుమీదుగా వెళ్తున్న వీళ్ళ బస్సుకే ప్రమాదం జరగడవేవిటి ? ఇంకా జరిగిందేవిటని అడుగుతారేవండీ ? నుదుట రాసిన రాతుంది చూసేరూ .... అదిచెరపడం మన శక్యవా ఏవిటండీ?